

నీరాజనం 8లో

కనకమహాలక్ష్మి అమ్మవారు కొలువుదీరిన విశాఖ బురుజుపేట భక్తులతో కిటకిటలాడింది. మార్గశిర నాలుగో గురువారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు.



గంగమ్మా.. కాపాడమ్మా! 8లో

సునామీ వంటి విలయం మళ్లీ మారణహోమం సృష్టించరాదని విశాఖ జాలారిపేట మహిళలు సముద్ర తీరంలో గంగమ్మ తల్లికి పూజలు చేశారు.



క్యాజువాలిటీ ఆధునికీకరణ

మహారాణిపేట: కేజీహెచ్‌లో క్యాజువాలిటీ ఆధునికీకరణ పనులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ గురువారం శ్రీకారం చుట్టారు.

న్యూస్‌రీల్

ఎస్సీ కులగణన జాబితా విడుదల

• 31 వరకు అభ్యంతరాల స్వీకరణ

తుమ్మపాల: జిల్లాలో ఎస్సీ కుల గణన జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించినట్లు కలెక్టర్ విజయకృష్ణన్ ప్రకటనలో తెలిపారు. వాటిపై ఈనెల 31 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యంతరాలపై 2025 జనవరి 6లోగా చర్యలు తీసుకుని, జనవరి 10న కులగణన తుదిజాబితా విడుదల చేస్తామని తెలియజేశారు. డేటాపై అభ్యంతరాలను వీఆర్వో స్వీకరిస్తారని, వీటిని మూడు దశల్లో తనిఖీ చేస్తారని తెలిపారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను సంబంధిత రెవెన్యూ అధికారికి నివేదిస్తారన్నారు. వీటిని పునఃపరిశీలించి తహసీల్దారుకు సిఫారసు చేస్తారని తెలిపారు. వీఆర్వో నివేదికలోని వివరాలను తహసీల్దారు పరిశీలించి, తుది ఆమోదం తెలిపి ఆ వివరాల్ని పోర్టల్‌లో పొందుపరుస్తారని వివరించారు.

టెన్త్ విద్యార్థులకు తత్కాల్ ఫీజు గడువు జనవరి 10

అనకాపల్లి: మార్చి 2025లో పదో తరగతి పరీక్షలు రాసే రెగ్యులర్ విద్యార్థులు ఫీజు చెల్లించకుంటే తత్కాల్ ద్వారా చెల్లింపునకు అవకాశం కల్పించినట్లు డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ వరకు తత్కాల్ రుసుము రూ.1000 చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని కోరారు.

రేషన్ డీలర్ల రాత పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జేసీ



పరీక్ష కేంద్రం వద్ద ఆర్డీవో రమణను వివరాలు అడుగుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

నర్సీపట్నం: నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లో డీలర్ పోస్టుల భర్తీకి గురువారం డాన్‌బాస్కో స్కూల్‌లో రాత పరీక్ష నిర్వహించారు. ఈ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పరిశీలించి ఆర్డీవో వి.వి.రమణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 37 రేషన్ దుకాణాలకు రాత పరీక్ష నిర్వహించారు. 126 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా వంద మంది పరీక్ష రాసినట్టు ఆర్డీవో తెలిపారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. తహసీల్దార్ రామారావు, రెవెన్యూ సిబ్బంది రాత పరీక్షను పర్యవేక్షించారు.

ఏపీజీవీబీ సేవలకు నాలుగు రోజుల విరామం

తుమ్మపాల: ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆంధ్ర, తెలంగాణ విభాగాల విభజన దృష్ట్యా ఈనెల 28 నుంచి నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలను నిలిపివేస్తున్నట్లు బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్‌చంద్ర తెలిపారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రస్తుతం తెలంగాణలోని వరంగల్ కేంద్రంగా ఏపీజీవీబీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తుందని, ఇకపై బ్యాంకు కార్యకలాపాలను విభజిస్తామన్నారు. ఇందుకోసం ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు బ్యాంకు సేవలతో పాటు ఏటీఎం కార్డులు, ఆన్‌లైన్ నగదు లావాదేవీలన్నీ నిలుపుదల చేస్తున్నామన్నారు. 2025 జనవరి 1 నుంచి బ్యాంకు సేవలు యథావిధిగా కొనసాగుతాయని, ఈ విషయాన్ని ఖాతాదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

వాల్తేర్ డీఆర్‌ఎంగా లలిత్ బోహ్రా




తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా లలిత్ బోహ్రా నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్వేకు ఉత్తర్వులు చేరాయి. ఇప్పటివరకు ఆయన న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ మంత్రిత్వ శాఖలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. వాల్తేర్ డీఆర్‌ఎంగా పనిచేసిన సౌరబ్‌ప్రసాద్ సీబీఐ కేసుల్లో ఇరుక్కున్నారు. అప్పటినుంచి వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ డీఆర్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశంలో 45 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సర్వీస్ అంశాలు ఉన్నాయి.

• ఇదేం బాదుడు బాబూ!

కూటమి కరెంట్ షాక్



- ఉమ్మడి విశాఖ ప్రజలపై రూ.293 కోట్లు అదనపు భారం
- ఎఫ్‌పీపీసీసీ పేరిట కూటమి సర్కారు దొంగ దెబ్బ
- బిల్లు కంటే అదనపు చార్జీల భారమే ఎక్కువ
- 5 యూనిట్ల వినియోగానికీ రూ.258 బిల్లు
- విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న నిరసన

ఉమ్మడి విశాఖ ప్రజలపై రూ.293 కోట్ల అదనపు భారం



పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలోని (సర్వీస్ నం.1164252279000722) జీకే రాజా ఇంట్లో రెండు నెలలుగా ఎవరూ ఉండటం లేదు. నవంబర్‌లో 5 యూనిట్లు వినియోగం కాగా రూ.85 బిల్లు వచ్చింది. డిసెంబర్‌లో 5 యూనిట్లు వినియోగానికి ఏకంగా రూ.258 బిల్లు వచ్చింది.

విశాఖ హెచ్‌బీ కాలనీలో ఓ వినియోగదారుడు బిల్లులో విద్యుత్ వినియోగం ఖర్చు రూ.27.72 అయితే ఫిక్స్‌డ్ చార్జీ రూ.30, కస్టమర్ చార్జీ రూ.25, ఇంధనం సర్దుబాటు చార్జీ-1 రూ.267.36, ఇంధనం సర్దుబాటు చార్జీ-2 రూ.102 కలిపి మొత్తం రూ.447.33 బిల్లు వచ్చింది. అంటే విద్యుత్ వినియోగం బిల్లు 6 శాతం అయితే 94 శాతం అదనపు భారం.





చీడికాడ మండలంలోని అర్జునగిరి గ్రామానికి చెందిన సాలాపు వెంకట నర్సింహమూర్తికి ఎస్సీ వినియోగదారులకు ఇచ్చే సబ్సిడీ కనెక్షన్ ఉంది. 12 ఏళ్ల నుంచి నెలకు రూ.100 నుంచి రూ.170 మధ్య కరెంటు బిల్లు వచ్చేది. ఎస్సీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అని ప్రకటించడంతో ఏనాడూ విద్యుత్ బిల్లు చెల్లించలేదు. 15 రోజుల క్రితం అందిన విద్యుత్ బిల్లు చూసి ఆయన కళ్లు బైర్లు కమ్మాయి. బిల్లులో రూ.4,652.95 చెల్లించమని ఉండడంతో కంగుతిన్నాడు.

ఈ మూడే కాదు ఏ ఇంటి తలుపు తట్టినా కరెంట్ షాక్ కొడుతోంది. కూటమి ప్రభుత్వం కొత్త సంవత్సరం కానుకగా.. ప్రజలందరికీ కరెంటు బిల్లుల బోనస్ అందించింది. ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో జనంపై పెనుభారం మోపింది. సీఎం చంద్రబాబు చెబుతున్న సంపద సృష్టి అంటే ఇదేనేమా మరి.

ఉమ్మడి విశాఖ జిల్లాలో వినియోగదారుల వివరాలు

ఎల్‌టీ కేటగిరీ వినియోగదారులు

కేటగిరీ	కనెక్షన్లు	డిమాండ్ (రూ.కోట్లలో)	అదనపు భారం (రూ.కోట్లలో)
డొమెస్టిక్	1577984	877.56	80
వాణిజ్యం, ఇతరులు	177265	422.14	10
పరిశ్రమలు	4615	66.61	05
ఇనిస్టిట్యూషనల్	32114	81.59	10
వ్యవసాయం, అనుబంధం	50713	9.12	02
మొత్తం	1842691	1457.01	107

హెచ్‌టీ కేటగిరీ వినియోగదారులు

కేటగిరీ	కనెక్షన్లు	డిమాండ్ (రూ.కోట్లలో)	అదనపు భారం (రూ.కోట్లలో)
టౌన్‌షిప్, కాలనీలు	36	20.79	01
వాణిజ్యం, ఇతరులు	1094	537.91	50
పరిశ్రమలు	632	3076.27	100
ఇనిస్టిట్యూషనల్	89	267.00	35
వ్యవసాయం, అనుబంధం	07	1.53	0.20
మొత్తం	1858	3903.51	186.20
ఎల్‌టీ+హెచ్‌టీ	1844549	5360.52	293.20

అనకాపల్లి జిల్లాలో..



- గత రెండేళ్లలో 28,927 విద్యుత్ సర్వీసులకు ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం అమలు చేశారు. ప్రస్తుతం వారెవరికీ సబ్సిడీ అందడం లేదు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 200 యూనిట్ లోపు వాడే ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు సబ్సిడీ కల్పించారు. కూటమి ప్రభుత్వంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడిన వినియోగదారులనూ బిల్లు చెల్లించమంటూ ఒత్తిడి తెస్తున్నారు.

2023-24లో 29,295 ఎస్సీ వినియోగదారులకు రూ.11.45 కోట్ల సబ్సిడీ

2024-25లో 31,064 ఎస్సీ వినియోగదారులకు రూ.2.06 కోట్ల సబ్సిడీ

2023-24లో 39,535 మంది ఎస్టీ వినియోగదారులకు రూ.9.11 కోట్ల సబ్సిడీ

2024-25లో 41,472 మంది ఎస్టీ వినియోగదారులకు రూ.2.85 కోట్ల సబ్సిడీ

కూటమి ప్రభుత్వం వచ్చాక తగ్గిన సబ్సిడీ

సాక్షి, అనకాపల్లి: విద్యుత్ బిల్లులు వినియోగదారులకు గుబులు పుట్టిస్తున్నాయి. జేబులకు చిల్లు పెడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నేతలు 'బాదుడే బాదుడు..' అంటూ గగ్గోలు పెట్టారు.. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రకటించారు. గద్దెనెక్కిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం రెండుసార్లు విద్యుత్తు బాంబులు పేల్చేసింది. పెంచిన ట్రూఅప్, సర్దుబాటు చార్జీల భారంతో సామాన్యులు బెంబేలెత్తిపోయే పరిస్థితి తెచ్చింది. విద్యుత్ వినియోగపు చార్జీల కంటే అదనపు బాదుడే అధికమైందంటూ షాక్ తినడం జనం వంతైంది. డిసెంబర్ బిల్లులు చూసిన వినియోగదారులు.. గత నెల బిల్లు కట్టినా.. రెండు నెలల బిల్లు కలిపి వచ్చిందేమోనని కంగారుపడుతున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సబ్సిడీ అందడం లేదు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే రాయితీలు గణనీయంగా తగ్గించారు. 200 యూనిట్లు లోపు వాడే ఈ సామాజిక వర్గాల వారికి క్రమంగా సబ్సిడీలు తగ్గిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అసలు స్వరూపం ప్రజలకు క్రమంగా అర్థమవుతోంది.

సర్కారు దగాపై జనాగ్రహం

చలికాలంలో విద్యుత్ వాడకం తగ్గినా బిల్లులు మాత్రం పెరుగుతుండటంపై జనాగ్రహం వెల్లువెత్తుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సగటున యూనిట్ ధర రూ.3.21 ఉంటే .. ప్రస్తుత కూటమి ప్రభుత్వం యూనిట్ ధరకు ఐదు రెట్లు అధికంగా వసూలు చేస్తోంది. దాదాపు 13 రకాల సుంకాలను వసూలు చేస్తూ యూనిట్ ధర రూ.15 వరకూ బాదేస్తోంది. బిల్లు చెల్లించడంలో కాస్త జాప్యం జరిగినా.. అపరాధ రుసుముతో సహా బిల్లులు వసూలు చేయాలని డిస్కమ్‌లకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. సర్కారు దగాపై జనం నిరసన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



గత ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు వినియోగదారులకు అందుబాటులో ఉండేవి. మా ఇంటికి రూ.300 నుంచి రూ.320 వరకు బిల్లు వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రూ.400 నుంచి రూ.450 వరకు విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. ట్రూఅప్ పేరుతో బాదేస్తున్నారు. వచ్చే నెల నుంచి మరింత భారం మోపుతారంటున్నారు.

– పడాల అప్పలనాయుడు, ఎం.కోడూరు, మాడుగుల మండలం

సామాన్యుల నడ్డి విరిచారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రజలను నమ్మబలికారు. అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలకే బాదుడు మొదలుపెట్టారు. మా ఇంటికి గతంలో రూ.900 నుంచి 950 బిల్లు వచ్చేది. ఈనెల రూ.1,420లకు బిల్లు వచ్చింది. సర్ చార్జీలు, ఎఫ్‌పీపీఏ చార్జీల పేరుతో భారం మోపుతున్నారు.

–కాళ్ల అప్పలనాయుడు, కె.జె.పురం, మాడుగుల మండలం

నేడు 'వైఎస్సార్‌సీపీ పోరుబాట'

• అన్ని నియోజకవర్గాల్లో విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి

సాక్షి, అనకాపల్లి: విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నిర్వహించే 'వైఎస్సార్‌సీపీ పోరుబాట'ను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని విస్మరించి ప్రజలపై భారం మోపుతున్న కూటమి ప్రభుత్వం కపట నాటకాన్ని ఎండగట్టేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అనకాపల్లి, మాడుగుల, నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేట, యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి పాదయాత్ర, ర్యాలీ, బైక్ ర్యాలీగా నియోజకవర్గ కేంద్రంలో విద్యుత్ కార్యాలయాలకు వద్దకు వెళ్లి వినతి పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొని పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ మండల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తత్కాల్ రుసుముతో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు

• గడువు ఈ నెల 31

అనకాపల్లి: జిల్లాలో ఏపీ ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు తత్కాల్‌లో ఫీజు చెల్లింపునకు ఈ నెల 31 వరకు అవకాశం కల్పించినట్లు డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. సాధారణ అడ్మిషన్ ఫీజుకు అదనంగా తత్కాల్ ప్రవేశ రుసుము రూ.600 చెల్లించి ప్రవేశం పొందవచ్చన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు లేదా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

బ్యాంకులు లక్ష్యాన్ని మించి
రుణాలు అందించాలి



డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ త్రైమాసిక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

• కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: బ్యాంకులు వ్యవసాయ, విద్య, ఉపాధి రంగాలకు లక్ష్యాలకు మించి రుణాలు అందించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ త్రైమాసిక సమావేశంలో ఆమె మాట్లాడారు. కౌలు రైతులకు కూడా వ్యవసాయ రుణాలు అందించాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు కూడా రుణాలు అందించాలని ఆదేశించారు.

కళాశాలల్లో క్యాంపులు నిర్వహించాలి

విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు విద్యారుణాలు అందించాలని, ఇందుకోసం కళాశాలల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, అవగామన కల్పించాలని సూచించారు. రుణమేళాలు నిర్వహించి, రుణాలు మంజూరు చేయాలన్నారు. నిరర్థక ఖాతాల్లో నగదును, సంబంధీకులకు అందజేయాలన్నారు. సదరు ఖాతాదారులను గుర్తించేందుకు డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది సహకారం తీసుకోవాలని తెలిపారు. తోటలు, కూరగాయలు, పశు సంవర్థక, డెయిరీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూతనివ్వాలన్నారు. ఆయా శాఖల అధికారులు, బ్యాంకు అధికారుల సమన్వయంతో వ్యవసాయ, అనుబంధ రంగ రైతులను ప్రోత్సహించాలని సూచించారు. బ్యాంకులు, నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా అందిస్తున్న నైపుణ్యశిక్షణను జిల్లాలోని ఫార్మా కంపెనీలలో గల ఉద్యోగాలకు అవసరమైన అంశాలలో అందించాలని ఆదేశించారు. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న వస్తువులకు బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. రైతులకు ఉదారంగా రుణాలు అందించాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ రుణ ప్రణాళిక అమలు నివేదికను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆర్‌బీఐ ఏజీఎం ఆర్.కె.హనుమకుమారి వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న రుణాలను సమీక్షించారు. బ్యాంకర్లు లక్ష్యాలను సాధించాలని, ఏమైనా సమస్యలుంటే జిల్లా అధికారులతో కలసి పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ ప్రాంతీయ అధికారి పి.సన్యాసిరాజు, జిల్లా గ్రామీణాభివృది సంస్థ పీడీ కె.శచీదేవి, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డా.బి.రామమోహనరావు, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నిండు గర్భిణికి డోలీ కష్టాలు

• గత ప్రభుత్వం ప్రారంభించిన రోడ్డు పనుల నిలిపివేత
• కూటమి సర్కారుపై సీపీఎం నేతల ధ్వజం



జాలంపల్లి పంచాయతీ సిరిపురం నుంచి గర్భిణిని డోలిలో తీసుకు వస్తున్న గ్రామస్తులు

మాడుగుల: పురిటి నొప్పులకు డోలీ కష్టాలు తోడు కావడంతో నిండు గర్భిణి నరకయాతన అనుభవించింది. పగవారికి కూడా ఇంత బాధ రాకూడదని భగవంతుడిని వేడుకుంది. జాలంపల్లి పంచాయతీ శివారు సిరిపురం గ్రామానికి చెందిన చెదల వెంకటలక్ష్మికి బుధవారం సాయంత్రం పురిటి నొప్పులు వచ్చాయి. ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు డోలీ కట్టి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న జాలంపల్లి వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి మాడుగుల సీహెచ్‌సీకి ఆటోలో తరలించారు. సుఖప్రసవం కావడంతో తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. కూటమి సర్కారు నిర్వాకంతో సిరిపురం గ్రామానికి రోడ్డు పనులు నిలిచిపోయాయని సీపీఎం మండల నాయకుడు ఇరటా నరసింహమూర్తి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ గ్రామానికి రోడ్డు వేసేందుకు రూ.5.30 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. అప్పట్లోనే ఈ రోడ్డుకు ఎర్త్ వర్క్ కూడా చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడా ఈ రోడ్డు పనులు జరగలేదన్నారు. రాజకీయాలు విస్మరించి, రహదారులు లేని గిరి గ్రామాలకు వెంటనే రోడ్లు నిర్మించాలని, ముందు మధ్యలో నిలిచిపోయిన రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి డోలీ మోతలు తప్పించాలని ఆయన కోరారు.

మైనారిటీస్ ఫైనాన్స్ ఈడీగా శంసున్నీసా బేగం



జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను కలిసిన శంసున్నీసా బేగం

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా డిప్యూటీ కలెక్టర్ శంసున్నీసా బేగం గురువారం బాధ్యతలు చేపట్టారు. పాతపోస్టాఫీసు వద్దనున్న ఉమ్మడి విశాఖ జిల్లా మైనారిటీస్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రస్తుత ఈడీ సత్యపద్మ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.

సమస్యలు పరిష్కరించాకే నేవీ రక్షణ గోడ నిర్మాణం

• పనులు అడ్డుకున్న కొప్పుగొండు గ్రామ ప్రజలు



కొప్పుగొండుపాలెంలో నిరసన తెలుపుతున్న గ్రామ ప్రజలు

రాంబిల్లి (యలమంచిలి): తమ సమస్యలు పరిష్కరించాకే నేవల్‌బేస్ రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టాలని రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెం గ్రామ ప్రజలు స్పష్టం చేశారు. కొప్పుగొండుపాలెం గ్రామ సమీపంలో జరుగుతున్న నేవల్‌బేస్ రక్షణ గోడ నిర్మాణ పనులను గురువారం వారు అడ్డుకొన్నారు. నేవల్‌బేస్ రక్షణ గోడ నిర్మాణం వలన పొలాల్లోకి దారి లేక ఇబ్బందులు పడుతున్నామని, కొండ చుట్టూ ప్రహరీ నిర్మాణం వలన ఉపాధి కోల్పోయామని వారు పేర్కొన్నారు. రుద్రభూమి లేక ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు సమస్య ఏర్పడిందన్నారు. గతంలో ప్రభుత్వ అధికారులు తమ డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికీ అవి అమలు కాలేదన్నారు. తమ ఇక్కట్లు తీర్చకుండా నేవీ నిర్మాణ పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు.

క్లుప్తంగా

విశాఖతో మన్మోహన్‌కు అనుబంధం


స్టీల్‌ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మన్మోహన్ సింగ్ (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో గతంలో పలుమార్లు విశాఖలో పర్యటించారు. 2006 మే 20న స్టీల్ ప్లాంట్ విస్తరణ పనులకు ఆయనే శంకుస్థాపన చేశారు. 2008 జనవరి 2వ తేదీన తూర్పు నౌకాదళాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఐఎన్ఎస్ జలశ్వ యుద్ధనౌకలో పర్యటించారు. అనంతరం జలశ్వలో విధులు నిర్వర్తిస్తున్న వారితో ఆన్ బోర్డుపై మన్మోహన్ కాసేపు ముచ్చటించారు. 2009 జూలై 26న సతీసమేతంగా విశాఖలో పర్యటించారు. ఆ సమయంలో భారత నౌకాదళంలో కీలకమైన జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్‌ని జాతికి అంకితం చేశారు. ఆయా సందర్భాల్లో ఆయనకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు.

జూ క్యూరేటర్‌గా మంగమ్మ బాధ్యతల స్వీకరణ


క్యూరేటర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మంగమ్మ

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు క్యూరేటర్‌గా జి.మంగమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ క్యూరేటర్‌గా పనిచేసిన డాక్టర్ నందనీ సలారియా గత అక్టోబరులో మంగళగిరికి బదిలీ కాగా.. అప్పటి నుంచి మంగమ్మ అదనపు క్యూరేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈనెల 24న ఆమెకు క్యూరేటర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ అటవీ శాఖ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె గురువారం పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జూ అసిస్టెంట్ క్యూరేటర్లు, ఆఫీస్ సూపరింటెండెంట్, ఎఫ్ఎస్‌వోలు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

రేపు జాబ్ మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని మహారాణిపేట ఎన్ఏసీ (నాక్) కేంద్రంలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో వీనస్ రిటైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ గ్రూప్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు.


హరిదాసుకు కానుకలు వేస్తున్న భక్తులు


ఆలయ ప్రాంగణంలో అమ్మ దర్శనానికి వేచి ఉన్న భక్తులు

సిరులతల్లికి నీరాజనం

- వైభవంగా సహస్ర ఘటాభిషేకం
- 20 వేల మంది భక్తులకు మహాన్నదానం
- 28న కనకమహాలక్ష్మి రథయాత్ర


సహస్ర ఘటాభిషేకంలో ఈవో శోభారాణి

డాబాగార్డెన్స్: సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు కొలువుదీరిన బురుజుపేట భక్తులతో కిక్కిరిసిపోయింది. మార్గశిర మాసం నాలుగో గురువారం సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. బుధవారం అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. మేలుకొలుపు అనంతరం అమ్మవారిని పసుపు నీళ్లు, పంచామృతాలతో అభిషేకించి పసుపు పూశారు. స్వర్ణాభరణాలతో అలంకరించారు. అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 వరకు ఈ అలంకరణతోనే భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వెండి కవచాలు తొడిగారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు మహానివేదన(రాజభోగం), 12 నుంచి 3 వరకు సర్వదర్శనం కల్పించి, అనంతరం దర్శనాలు నిలిపివేశారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సహస్రఘటాభిషేకం వైభవంగా జరిపారు. రాత్రి 7 నుంచి అమ్మవారి దర్శనాలు పునరుద్ధరించారు. తొలిపూజలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

మహాన్నదానం

టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

28న రథయాత్ర

ఈ నెల 28న కనక మహాలక్ష్మి రథయాత్ర నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 4 నుంచి జగదాంబ జంక్షన్, మహారాణిపేటలోని అమ్మవారి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామ చంద్రస్వామి ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభించనున్నారు. జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజ్ డౌన్, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్‌రూమ్ మీదుగా అమ్మవారి ఆలయం వరకు యాత్ర సాగనుంది.

క్యూలైన్లు కిటకిట

క్యూలైన్లు ఆలయం నుంచి రీడింగ్ రూమ్ మీదుగా టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయానికి చేరుకున్నాయి. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో క్యూలైన్లలో ఉన్నవారికి మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను దేవస్థానం అందించింది. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం కల్పించారు. స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం అందించాయి.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ కిరణ్మయి, కుటుంబ సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్ జె.సుభద్ర, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వీరిచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందించారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు పాతనగరానికి చెందిన సంఘ సేవకుడు ఎం.వీరభద్రరావు మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.


అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు


అమ్మవారికి స్వయంగా పూజలు చేస్తున్న భక్తులు

నేటి కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 నుంచి 6 వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ఉదయం 6 నుంచి 11 వరకు సర్వదర్శనం, 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు పంచామృతాభిషేకం, 12 నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తరనామార్చన నిర్వహిస్తారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- నల్లక్వారీ మడుగులో మునిగి బాలుడి మృతి

పెందుర్తి: పాఠశాలలకు సెలవు కావడంతో సరదాగా స్నేహితులతో ఈతకు వెళ్లిన ఓ బాలుడు నీటిలో మునిగి మృతి చెందాడు. పెందుర్తి సమీపంలోని నల్లక్వారీ మడుగులో జరిగిన ఈ విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చినముషిడివాడ సమీపంలోని హుద్‌హుద్ కాలనీలో నివాసం ఉంటున్న ధీరజ్ ప్రధాన్ దంపతులకు నలుగురు సంతానం. పదేళ్ల క్రితం నేపాల్ నుంచి బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చిన ధీరజ్ కార్పెంటర్‌గా పనులు చేస్తుంటాడు. అతని రెండో కుమారుడు అర్జున్ ప్రధాన్(12) చినముషిడివాడలోని పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. బుధవారం క్రిస్మస్ సెలవు కావడంతో మధ్యాహ్నం స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా వారితో కలిసి సమీపంలోని నల్లక్వారీ మడుగులో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయిన అర్జున్ మృతి చెందాడు.

తప్పిపోయాడని ఫిర్యాదు

ఇంటి నుంచి బయటకు వెళ్లిన అర్జున్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో బుధవారం రాత్రి పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో తండ్రి ధీరజ్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం నల్లక్వారీ మడుగులో బాలుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడి వెళ్లిన సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ అసిరితాత మృతదేహాన్ని బయటకు తీయించారు. విగతజీవిగా పడి ఉన్న అర్జున్‌ను చూసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోధించారు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.


నల్లక్వారీ మడుగులో అర్జున్ మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు (ఇన్‌సెట్) అర్జున్ (ఫైల్)

మెమూ స్థానంలో సాధారణ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రస్తుతం నడుస్తున్న మెమూ రైళ్ల స్థానంలో గతంలో మాదిరి సాధారణ రైళ్లను నడపనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

1)విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం (07470/07471) మెమూ పాసింజర్ స్పెషల్ ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు సాధారణ రైలుగా నడవనుంది. ఈ రైళ్లు జనవరి 1వ తేదీ నుంచి మారిన నెంబర్లతో నడుస్తాయి. విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం(67289 /67290) నెంబర్లుతో జనవరి 1 నుంచి మార్చి 1వ తేదీ వరకు (శుక్ర, ఆదివారాలలో మినహా) నడుస్తాయి.

2)విశాఖపట్నం-విజయనగరం(07468) మెమూ పాసింజర్ ఈ నెల 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు (గురువారాలలో మినహా) సాధారణ రైలుగా నడుస్తుంది. విజయనగరం-విశాఖపట్నం (07469) మెమూ పాసింజర్ ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 1వ తేదీవరకు (శుక్రవారాలలో మినహా) సాధారణ రైలుగా నడుస్తుంది. ఈ రైళ్లు జనవరి 1వ తేదీ నుంచి మారిన నంబర్లు (67287/67288)తో నడవనున్నాయి.

విశాఖ-విజయనగరం రైలు పార్వతీపురం వరకు పొడిగింపు

విశాఖపట్నం-విజయనగరం - విశాఖపట్నం (67287/67288) మధ్య నడిచే రైలును ఈ నెల 27వ తేదీ నుంచి తాత్కాలికంగా పార్వతీపురం వరకు పొడిగించారు. విశాఖపట్నంలో ఈ నెల 27న బయల్దేరే విశాఖపట్నం-విజయనగరం (67687)రైలు పార్వతీపురం వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 28న (67288 రైలు) పార్వతీపురం నుంచి బయల్దేరుతుందని పేర్కొన్నారు.

హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు స్లీపర్ క్లాస్ కోచ్

పండగల వేళ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలికంగా అదనపు స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం కె.సందీప్ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం-అమృత్‌సర్(20807)హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 27నుంచి, అమృత్‌సర్-విశాఖపట్నం(20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 29వ తేదీ నుంచి 1 స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నట్లు పేర్కొన్నారు.


సముద్రతీరంలో పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు, పిల్లలు



గంగమ్మా.. కాపాడమ్మా!

ఎంవీపీకాలనీ: గంగమ్మతల్లి పూజా మహోత్సవం జాలరిపేటలో గురువారం కనుల పండువగా జరిగింది. 2004 డిసెంబర్ 26న సునామీ సృష్టించిన బీభత్సం అనంతరం ఏటా అదే రోజున పెదజాలరిపేట మత్స్యకారులు గంగమ్మ తల్లికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా తమ కుటుంబాలను చల్లగా చూడాలని, విపత్తుల నుంచి రక్షించాలని గంగమ్మతల్లిని వేడుకున్నారు. తీరంలో పూజల అనంతరం పూజా సామగ్రిని సముద్రంలో విడిచిపెట్టారు. మత్స్యకార మహిళలు నిర్వహించిన కలశాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. తీరంలో మహిళలు వరుసక్రమంలో నిలిచి, కొబ్బరికాయలు కొట్టి, పూజలు చేశారు. సముద్రానికి హారతి ఇచ్చి, పసుపునీటిని, పాలను సముద్రంలో కలిపి, ఆ నీటిని శిరస్సుపై చల్లుకున్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మత్స్యకార మహిళలతో పోటెత్తిన సాగర తీరం


అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- ప్రధాన కూడాలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

బుచ్చెయ్యపేట : అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని, ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాల వద్ద ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్థానిక పోలీసులకు సూచించారు. గురువారం సాయంత్రం ఆయన బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలో క్రైమ్ రేటు గురించి ఎస్ఐ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాల మత్తును సంకల్పం కార్యక్రమం ద్వారా తరిమివేద్దామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. చోరీలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణకు గస్తీ పెంచాలన్నారు. తీవ్రమైన కేసుల ఫైల్స్‌ను పరిశీలించి కేసుల పురోగతి తెలుసుకున్నారు. రౌడీషీటర్స్, చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ప్రత్యేక దృష్టి

- జిల్లా భూ సర్వే ఏడీ గోపాల్ రాజా


వెదురుపల్లిలో సర్వే రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ గోపాల్‌రాజా

నాతవరం: జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడేందుకు కృషి చేస్తున్నామని సర్వే ఏడీ గోపాల్‌రాజా తెలిపారు. మండలంలోని వెదురుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు విచ్చేసిన ఆయన సర్వేకు సంబంధించిన ప్రధాన సమస్యలపై తహసీల్దార్ వేణుగోపాల్‌ను ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులో రైతులు ఇచ్చిన ఫిర్యాదులతో పాటు ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన భూములకు సంబంధించిన సర్వే దరఖాస్తులను స్వయంగా పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల చోడవరం నియోజకవర్గంలో కొంతమంది రాజకీయ దన్నుతో తప్పుడు సర్వే నెంబర్లతో ప్రభుత్వ భూములను రిజిస్టర్ చేయించుకున్నారని, రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా క్షేత్రస్థాయిలో చేసిన పరిశీలనలో ప్రభుత్వ భూమి వెలుగులోకి వచ్చిందని చెప్పారు. నాతవరం మండలంలోనూ పలు ప్రాంతాల్లో భూముల వివాదాలు ఉన్నట్లు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆయా భూములను స్వయంగా సర్వే చేసి వాస్తవాలు వెలికితీస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల సర్వేయర్లు అంకిత భావంతో పని చేస్తే రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందన్నారు. సచివాలయ సర్వేయర్ల పని తీరులో మార్పు తీసుకురావడానికి దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ, మండల సర్వేయరు ప్రసాద్, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్ష ఎన్నికలో వాగ్వాదం


బూత్ కమిటీలపై ప్రశ్నిస్తున్న రాంబాబు

మాకవరపాలెం: బీజేపీ మండల అధ్యక్ష ఎన్నికలో వాగ్వాదం చోటు చేసుకుంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ యర్రంనాయుడు సమక్షంలో గురువారం రాచపల్లి జంక్షన్ సమీపంలోని కామేశ్వరమ్మ ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి బూత్ కమిటీల వివరాలను సేకరించారు. వ్యక్తులు లేకుండా బూత్ కమిటీలను ఎలా నియమించారంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు ప్రశ్నించారు. దీంతో యర్రంనాయుడు, రాంబాబు మధ్య వాగ్వాదం జరిగింది. ఒక వర్గానికి కొమ్ముకాసేలా జిల్లా నాయకులు వ్యవహరిస్తున్నారని రాంబాబు ఆరోపించారు. నిష్పక్షపాతంగా అధ్యక్ష ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. రెండు వర్గాల వివాదం నేపథ్యంలో అధ్యక్ష ఎన్నిక నిర్వహించకుండా జిల్లా నాయకులు వెనుదిరిగారు. అందరి అభిప్రాయాలు సేకరించి అధ్యక్షుడిని నియమిస్తామని జిల్లా నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాయుడు, ప్రధాన కార్యదర్శి పిల్లా బాబూరావు, నాయకులు చుక్కల శ్రీను, రుత్తల నారాయణమూర్తి, ఆంజనేయమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రమాదంలో రాజ్యాంగం


పార్టీ స్థూపం వద్ద నినాదాలు చేస్తున్న రామునాయుడు, పార్టీ నాయకులు

- సీపీఐ సహాయ కార్యదర్శి రామునాయుడు

నర్సీపట్నం: అనేక శ్రమలకోర్చి నిర్మించుకున్న భారత రాజ్యాంగం బీజేపీ ప్రభుత్వం వల్ల ప్రమాదంలో పడిందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పేర్కొన్నారు. పార్టీ శత వసంతాల వేడుకను పురస్కరించుకుని నర్సీపట్నం మండలం, గబ్బాడలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కారణంగా భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని తీసుకురావాలని చూస్తున్నారని విమర్శించారు. లౌకిక, సామ్యవాద అనే పదాలను రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలని బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో కేసు వేస్తే, కోర్టు బీజేపీకి మొట్టికాయలు వేసినా సిగ్గురాలేదని విమర్శించారు. అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు దారుణమన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ భావజాలాన్ని భుజాన వేసుకుని మోస్తోందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, డీసీహెచ్. క్రాంతి, సీనియర్ నాయకులు పి.గంగాభవాని, సీపీఐ శాఖ కార్యదర్శి సత్తిబాబు, సభ్యులు రాజుబాబు, సన్యాసినాయుడు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర తీరంలో ఎర్ర కవాతు


భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) శత వార్షికోత్సవాల ప్రారంభం సందర్భంగా బీచ్‌రోడ్డులో ఎర్ర కవాతు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు సర్కిల్ నుంచి ఆర్‌కే బీచ్ వరకు సాగారు. (ఇన్‌సెట్) తీరంలో కవాతు చేస్తున్న సీపీఐ శ్రేణులు

ఏయూ క్యాంపస్: భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) శత వార్షికోత్సవాల ప్రారంభం సందర్భంగా బీచ్‌రోడ్డులో ఎర్ర కవాతు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు సర్కిల్ నుంచి ఆర్‌కే బీచ్ వరకు సాగారు. కమ్యూనిస్టు పార్టీ పోరాట స్ఫూర్తితో భవిష్యత్తులో భారత్‌లో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం కాపాడేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. రష్యాలో లెనిన్ సారథ్యంలో విప్లవం విజయం సాధించడంతో మన దేశంలో స్వాతంత్ర్య పోరాట సమయంలో మార్క్సిజాన్ని అధ్యయనం చేసి 1925 డిసెంబర్ 26న కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం తీసుకురావడంలో పార్టీ చేసిన కృషిని వివరించారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ప్రజల మధ్యకు వెళ్లి ఉద్యమాలను నిర్మించి దేశంలో సృష్టించిన సంపదను అందరికీ సమానంగా పంచేందుకు, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక తత్వాన్ని కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, రాష్ట్ర సమితి సభ్యుడు సీహెచ్ రాఘవేంద్రరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు జీఎస్‌జే అచ్యుతరావు, ఎ.విమల, ఎస్‌కే రహమాన్, కె.సత్యాంజనేయ, జి.రాంబాబు, కె.సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ–1 సెక్షన్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు, జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, డీ–1 సెక్షన్ ఏఈ త్రినాథ్ గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పూడిమడక రహదారి, శారదా కాలనీ, నెహ్రూచౌక్, న్యూకాలనీ, రాజా థియేటర్ మెయిన్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం రహదారి, నర్సింగరావుపేట, చవితి వీధి, దుర్గాలాడ్జి వీధి, కోట్నీ వీధి, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని వారు కోరారు.

వ్యవసాయానికి నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ–2 సెక్షన్ పరిధిలో జాతీయ రహదారి కొప్పాక 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం అగ్రి కల్చరల్ వ్యవసాయ భూములకు విద్యుత్‌ను శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, డీ–2 ఏఈ జి.వి.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెపారు. వ్యవసాయ రైతులు సహకరించాలని ఆయన కోరారు.

‘విద్యుత్ రంగం ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వాలు అడుగులు’



గవరపాలెం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ వ్యాప్తంగా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు విమర్శించారు. స్థానిక గవరపాలెం విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చండీఘర్ రాష్ట్రంలో విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్కడ కార్మికులు చేస్తున పోరాటానికి దేశ వ్యాప్తంగా మద్దతు తెలపాలని కోరారు. కూటమి ప్రభుత్వం కూడా మన రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి.వి.శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, కల్యాణ్, సురేష్,పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 885 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,000	5,200
మొదటి రకం	3,800	4,200
రెండో రకం	3,400	3,870
మూడోరకం	3,300	3,380

అనకాపల్లి సినిమాలు

పుష్ప–2	: సత్యనారాయణ స్క్రీన్–1
ముఫాసా	: సత్యనారాయణ స్క్రీన్–2
యూ	: పర్శిసాయి
మ్యాక్స్	: షిర్డీసాయి
శ్రీకాకుళం షెర్లాక్ హోమ్ :వెంకటేశ్వర	
అమరన్	: శ్రీసత్య
డ్రింకర్ సాయి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 45 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–6 యూనిట్లు, బీ పాజిటివ్–16 యూనిట్లు, ఓ పాజిటివ్–21 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 359 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924–223595 నంబరులో సంప్రదించవచ్చు.



నూనె కొట్టు సందులో తెరుచుకోని షాపులు



షాపులు తెరవకపోవడంతో నిర్మానుష్యంగా బండిగాడి వీధి

స్తంభించిన వ్యాపారాలు

- అనకాపల్లిలో కూలి రేట్ల పెంపుపై కుదరని ఏకాభిప్రాయం
- సమ్మెకు దిగిన కూలీలు
- బంద్ పాటించిన వ్యాపారులు
- షాపులు తెరుచుకోకపోవడంతో జనం అవస్థలు

అనకాపల్లి: పట్టణంలో గురువారం వ్యాపారాలు స్తంభించిపోయాయి. కూలి రేట్ల పెంపు విషయంలో అంగీకారం కుదరకపోవడంతో వ్యాపారులు బంద్ పాటించగా.. ముఠా వర్కర్లు సమ్మె చేశారు. అనకాపల్లి పట్టణ పరిధిలో పప్పులు రైస్ దుకాణాలు 25 ఉండగా, కిరాణా దుకాణాలు 80, ఆయిల్ దుకాణాలు 10 ఉన్నాయి. ఈ దుకాణాల ద్వారా నిత్యం లక్షలాది రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. ఇటు దుకాణాలు, అటు ముఠా కార్మికులు సమ్మెలు చేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ముఠా కార్మికుల కూలి రేట్లు పెంచాలని గత 20 రోజుల్లో మూడు సార్లు కార్మికులు.. బియ్యం, కిరాణా, ఆయిల్ వ్యాపారులకు సమ్మె నోటీలు ఇచ్చారు. దీనిపై మూడు సార్లు జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఇరు వర్గాలు బంద్, సమ్మెకు దిగడంతో షాపులు తెరుచుకోలేదు. దీంతో నిత్యావసర సరకుల కోసం వచ్చిన గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. షాపులు తెరుచుకోకపోవడంతో నూనె కొట్టు సందు, బండిగాడి వీధి నిర్మానుష్యంగా కనిపించాయి. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ముఠా కార్మికులకు బస్తాకు ఎగుమతి, దిగుమతులకు ఇచ్చే రేట్లు 50 శాతం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. దుకాణ యజమానులు రేట్లు పెంచే వరకూ సమ్మె చేస్తామని కార్మికులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు దుకాణాల యాజమానుల వాదనలు మరోలా ఉన్నాయి. జిల్లాలో యలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, చోడవరం, పాయకరావుపేట మండలాల కంటే ముఠా కార్మికుల కూలి రేట్లు అధికంగా ఇస్తున్నామని అనకాపల్లి రైస్ పప్పులు, కిరాణా, ఆయిల్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు చెబుతున్నారు. అనకాపల్లి పట్టణలో డీ–మార్టు వంటి పెద్ద దుకాణం రావడంతో వ్యాపారాలు తగ్గాయని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి సమయంలో ముఠా కార్మికులు సమ్మె చేయడంతో మరింత ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతున్నారు. ఒక్కసారిగా ముఠా కార్మికుల కూలి రేట్లు 50 శాతం పెంచాలంటే ఇబ్బందిగా ఉంటుందని, 13 శాతం పెంచేందుకు కృషి చేస్తామని యజమానులు అంటున్నారు. ప్రస్తుతం 50 కిలోల బస్తాకు రూ.9.64లు, 26 కిలోల బస్తాకు రూ.8.06లు, ఆయిల్ డబ్బాకు రూ.5.18 చొప్పున కూలి చెల్లిస్తున్నట్లు వ్యాపారులు చెప్పారు.

డీఆర్‌వోకు వ్యాపారుల ఫిర్యాదు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న నిత్యావసర దుకాణాల యజమానులు

ముఠా కార్మికుల సమ్మెపై పట్టణ పరిధిలో మూడు మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు డీఆర్‌వో సత్యనారాయణకు అనకాపల్లి మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూడు అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డేడ సత్తిబాబు, బొడ్డేడ శంకరరావు, కొత్తూరు లక్ష్మీజీ, పలువురు దుకాణ యాజమానులు పాల్గొన్నారు.

ముఠా కార్మికుల కూలి రేట్లు పెంచాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు, సీఐటీయూ నాయకులు

అనకాపల్లి: పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా పట్టణ పరిధిలో ముఠా కార్మికుల కూలిరేట్లు పెంచాలని ముఠా కార్మికుల వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక కూరగాయల మార్కెట్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ గురువారం యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులు స్పందించి ముఠా కార్మికుల కూలి రేట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు వి.వి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు, వర్కర్స్ బోడి రాజు, కనకాల అప్పలరాజు. తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్, తదితరులు

- పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఈ ఆరు మాసాల్లోనే ప్రజలపై రాష్ట్ర వ్యాప్తంగా రూ.15,485 కోట్ల భారం మోపిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ధ్వజమెత్తారు. స్థానిక రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో గురువారం సీనియర్ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తలపెట్టిన వైఎస్సార్‌సీపీ పోరుబాటను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కోటి ఆశలతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిన రాష్ట్ర ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలపై వివిధ రూపాల్లో భారం మోపడం అన్యాయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు స్థానిక రింగ్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ చేపడతామన్నారు. రింగ్ రోడ్డు, భీమునిగుమ్మం, నాయుళ్లవీధి, రామచంద్ర థియేటర్ రహదారి, జార్జిక్లబ్ రహదారి, నెహ్రూచౌక్, వేల్పులవీధి జంక్షన్, పెరుగుబజార్ జంక్షన్, వన్‌వే ట్రాఫిక్, రింగ్‌రోడ్డు మీదుగా గవరపాలెంలో విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, ఆ శాఖ ఎస్ఈకు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మల్రిపల్లి శోభ, 80, 84వ వార్డుల ఇన్‌చార్జ్‌లు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, పార్టీ అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, పార్టీ సీనియర్ నాయకులు పి.డి.గాంధీ, భీశెట్టి జగన్, కుండల రామకృష్ణ, దాడి నారాయణరావు, రాపేటి వెంకటేశ్వరరావు, వేగి త్రినాథ్, పల్లెల సాయికిరణ్, ఎ.ధనలక్ష్మి, ముమ్మిన గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



సంతోషిమాతకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ భాస్కరరావు దంపతులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సంతోషిమాత అమ్మవారి ఆలయ 45వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జాము నుంచి ఆలయ అర్చకుడు సరిపిల్లి కామేశ్వరరావు సమక్షంలో ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు దంపతులు అమ్మవారికి అభిషేకాలు, మహాలక్ష్మి గణపతి పూజ, సంతోషిమాత హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజ అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జైసంతోషిమాత అమ్మవారి నామ జపం నిర్వహిస్తామని, శనివారం మధ్యాహ్నా భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో టి.రాజా సులోచన, కమిటీ సభ్యులు ఆళ్ల రవికుమార్, బుద్ధ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కాని సదస్సులెందుకు?



పిసినికాడలో డీటీ వై.శ్రీరామమూర్తితో మాట్లాడుతున్న ఓ రైతు

అనకాపల్లి: భూ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని పిసినికాడ గ్రామ రైతులు అప్పారావు, సత్తిబాబు, సోమేష్ అన్నారు. మండలంలో పిసినికాడ గ్రామంలో గురువారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో అధికారులపై రైతులు ఒత్తిడి చేయడంతో అక్కడే ఉన్న డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీరామమూర్తి మాట్లాడుతూ గ్రామంలో రైతుల భూసమస్యలు పరిష్కారానికి సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు మాట్లాడుతూ మాగ్రామంలో భూ సమస్య ఎక్కువగా ఉందని, దీనిపై దృష్టి సారించాలన్నారు. గతంలో ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో అర్జీ ఇచ్చినప్పటికీ నేటి వరకూ పరిష్కారం జరగలేదని, గ్రామంలో ఎందు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారో అర్థం కావడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా భూసమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డీటీ శ్రీరామమూర్తి రైతులకు హామీ ఇచ్చారు.

ఘనంగా సీపీఐ శత వసంత వేడుకలు



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న రాజాన దొరబాబు, సన్యాసిరావు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులో సీపీఐ శత వసంత వేడుకలను స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా కార్యదర్శి సభ్యుడు సన్యాసిరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ వసంతంలోకి అడుగుపెట్టడం శుభపరిణామమన్నారు. బీజేపీ మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కన్నబాబు, సత్తిబాబు, ఫణీంద్ర, త్రినాథ్, వియ్యపు రాజు, బాబ్జి, వీరాచారి, శంకరరావు, తాకాశి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మీ.. కరుణించమ్మా..



ఆలయం ఎదుట కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కశింకోటలో ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ

కశింకోట: కశింకోటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్త జనంతో కిక్కిరిసింది. మార్గశిర మాసోత్సవాల చివరి గురువారం సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మూల అమ్మవారి విగ్రహాన్ని నూతన వస్త్రాలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ముందుగా ఆలయం బయట ఉన్న అమ్మవారి విగ్రహానికి భక్తులు పోటాపోటీగా పూజలు చేశారు. అనకాపల్లి గవరపాలెంకు చెందిన మహిళా బృందం కోలాటం ఆకట్టుకుంది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాడి నాగరాజు, వార్డు మాజీ సభ్యురాలు సూరిశెట్టి రేవతి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మహిళల కోలాటం



బయ్యవరం కనకమహాలక్ష్మి ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు

కశింకోట: బయ్యవరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసం ఆఖరి గురువారం సందర్భంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రాంగణంలో హోమం జరిపారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి జయ పాల్గొన్నారు.

1,640 హెక్టార్లలో కోతలు పూర్తి



కూండ్రంలో తడిచిన వరి పనలు పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారులు

అనకాపల్లి: మండలంలో 2,509 హెక్టార్లలో సాగైన వరి పంటలో ఇప్పటి వరకూ 1,640 హెక్టార్లలో కోతలు పూర్తి అయ్యాయని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.రంగాచారి తెలిపారు. మండలంలో కుంచంగి, కూండ్రం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 281 హెక్టార్లలో వరి పనలు తడిచాయని, వీటిపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. రైతులు తుపాను ప్రభావం తగ్గిన తరువాత మిగతా పంట కోతలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాస్, గ్రామ వ్యవసాయ సహాయకులు తులసి, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ ఎం.వెంకట నారాయణ

అనకాపల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ సూచించారు. స్థానిక జాతీయ రహదారి నూకాంబిక అమ్మవారి ఆర్చ్ వద్ద వాహనదారులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాల సమయంలో తలకు రక్షణ ఉంటుందన్నారు. అధిక స్పీడ్‌తో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అటువంటి వారిపై సీసీ పుటేజీలు ఆధారంగా కేసులు నమోదు చేస్తామన్నారు. హెల్మెట్ లేని 10 మంది ద్విచక్ర వాహనదారులకు అపరాధ రుసుం విధించారు.

యాచకులకు రగ్గులు, దుప్పట్ల పంపిణీ



అనకాపల్లి రైల్వే స్టేషన్ వద్ద యాచకులకు రగ్గులు పంపిణీ చేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: చలి నుంచి రక్షణ కోసం యాచకులకు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం గురువారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాశ్రయులు, అనాథలు, యాచకులు, మతిస్థిమితం లేని అభాగ్యులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే జీతాలు చెల్లించాలి



ఏడీ రమాజ్యోతికి వినతిపత్రం అందిస్తున్న పీఆర్‌టీయూ పట్టణ శాఖ అధ్యక్షుడు దాడి అప్పలనాయుడు

అనకాపల్లి: జీవీఎంసీ పరిధిలోని ఉపాధ్యాయుల జీతాలను పాత పద్ధతిలోనే చెల్లించాలని పీఆర్‌టీయూ పట్టణ శాఖ అధ్యక్షుడు దాడి అప్పలనాయుడు కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల జీతాలను ఎంఈవోల నుంచి త్వరలో తొలగించి హైస్కూళ్ల హెచ్ఎంలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా ఉందని, అలా చేయడం వల్ల సాంకేతిక సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. ఈ మేరు కొప్పాక డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ రమాజ్యోతికి పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. నవంబర్, డిసెంబర్ మాసాల్లో రెండు దఫాలుగా జరిగిన మున్సిపల్ పదోన్నతులు అడహక్ ప్రాతిపదికన ఉత్తర్వులు ఇచ్చినందున వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలలో జరిగే బదిలీల్లో ఆ స్థానాలను ఖాళీగా చూపించాలని కోరారు. పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి రొంగళి కృష్ణకుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎ.వి.రామచంద్రరావు పాల్గొన్నారు.

వారపు సంతలో కూరగాయల ధరలు

కశింకోట: కశింకోట వారపు సంతలో కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. గోబీపువ్వు రూ.20, కిలో టమాటా, క్యాబేజి రూ.30, బంగాళాదుంప, ఉల్లిపాయ, బెండకాయ, దొండకాయ, వంకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, గోరు చిక్కుడు రూ.60, చిక్కుడు, బీన్స్ రూ.80, క్యాప్సికం రూ.100, పచ్చి బఠాణి కాయలు రూ.120కి విక్రయాలు సాగాయి.

అనధికార విద్యుత్ కోతలతో అవస్థలు

కశింకోట:అనధికార విద్యుత్ కోతలతో కశింకోట ప్రాంతంలో జనం నానా అవస్థలు పడుతున్నారు. బుధవారం రాత్రి సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కశింకోటలో అంధకారం అలముకుంది. కశింకోట విద్యుత్ సబ్ స్టేషన్‌లోని 133 కేవీలో లైన్ నిబ్ దెబ్బతినడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని విద్యుత్ సిబ్బంది తెలిపారు. అర్ధరాత్రి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కావడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.